

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విజయవాడ భవానీపురానికి చెందిన బాడిత శంకర్ కుటుంబం శనివారం రూ.1,01,116 విరాళం సమర్పించింది.



జోరు వానలోనూ జూడాల నిరసన

లబ్బీపేట: విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో జూనియర్ వైద్యుల నిరసన శనివారం కొనసాగింది. తమపై దాడి చేసిన అందరినీ అరెస్ట్ చేసే వరకూ ఆందోళన విరమించబోమని వర్షంలో బైటాయించారు.

సీఎంను కలిసిన సీపీ



విజయవాడ స్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్.వి.రాజశేఖరబాబు సీఎం కార్యాలయంలో సీఎం నారా చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

న్యూస్‌రీల్

ఇద్దరు డీసీపీలు బదిలీ



అధిరాజ్‌సింగ్‌రాణా



కంచి శ్రీనివాసరావు

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో పని చేస్తున్న ఇరువురు డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ)లను బదిలీ చేస్తూ రాష్ట్ర హోం శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. తాజా ఉత్తర్వుల ప్రకారం లా అండ్ ఆర్డర్ డీసీపీ అధిరాజ్ సింగ్ రాణా నంద్యాల ఎస్పీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనంతపురం ఎస్పీ గౌతమిశాలిని నియమించారు. రూరల్ డీసీపీ కంచి శ్రీనివాసరావు పల్నాడు ఎస్పీగా బదిలీ అయ్యారు. ఈ స్థానంలో ఎవరినీ నియమించలేదు.

దుర్గమ్మకు రికార్డు స్థాయి ఆదాయం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వారాంతపు రద్దీతో ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు రికార్డు స్థాయి ఆదాయం లభించింది. శనివారం వివిధ ఆర్జిత సేవలు, దర్శన టికెట్ల విక్రయం ద్వారా రూ.37.03 లక్షల ఆదాయం సమకూరిందని దుర్గగుడి ఈఓ కె.ఎస్.రామరావు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు రూ.37,03,032 ఆదాయం లభించిందని పేర్కొన్నారు. రూ.500 టికెట్ల ద్వారా రూ.12.62 లక్షలు, రూ.300 టికెట్ల ద్వారా రూ.3.33 లక్షలు, రూ.100 టికెట్ల ద్వారా రూ.4.75 లక్షల ఆదాయం లభించిందని వివరించారు. ఇక కేశఖండన శాలలో టికెట్ల విక్రయం, లడ్డూ, పులిహోర ప్రసాదాల ద్వారా భారీగా ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు. అన్నదానం, ఇతర విరాళాల ద్వారా రూ.3.15 లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు.

త్రో బాల్ రాష్ట్ర జట్ల ఎంపిక పోటీలకు 150 మంది హాజరు



విజయవాడస్పోర్ట్స్: దక్షిణ భారత త్రోబాల్ సీనియర్ స్త్రీ, పురుషుల పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఆంధ్రప్రదేశ్ జట్ల ఎంపిక పోటీలను విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో శనివారం నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారని ఏపీ త్రో బాల్ సంఘం కార్యదర్శి ఇ.సులోచన తెలిపారు. అత్యంత క్రీడా నైపుణ్యం ఉన్న క్రీడాకారులను రాష్ట్ర జట్లకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపికైన జట్లు ఆగస్టు రెండు నుంచి నాలుగో తేదీ వరకు బెంగళూరులో జరిగే సౌత్ జోన్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.

వానొస్తే పడవ ప్రయాణమే..!

- బందరులోని మాచవరం దుస్థితి ఇదీ..
- 30 కుటుంబాల వారికి తప్పని ఇక్కట్లు
- రూ.50 వేలతో పడవ కొని రాకపోకలు



పడవలో ప్రయాణిస్తున్న కాలనీవాసులు

మచిలీపట్నంటౌన్: కొద్దిపాటి వర్షం పడినా ఆ ప్రాంతం నీట మునుగుతుంది. రోడ్లపై రాకపోకలు స్తంభిస్తాయి. ఏ చిన్న అవసరమైనా పడవ ప్రయాణమే ఆ ప్రాంత ప్రజలకు దిక్కవుతుంది. ఇది ఏ మారుమూల గ్రామంలోనే ఉన్న పరిస్థితి కాదు. కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నం నగరం నడిబొడ్డునున్న మాచవరం ప్రాంతం దుస్థితి ఇది.

పడవ ప్రయాణమే దిక్కు

మచిలీపట్నం నగరం నడిబొడ్డున, రెండో డివిజన్‌కు చెందిన మాచవరంలోని మార్కెట్ యార్డు రోడ్డులో ఖాళీస్థలం పక్కన 30 కుటుంబాల ప్రజలు జీవనం సాగిస్తున్నారు. కొద్దిపాటి వర్షం పడినా మాచవరం ప్రాంతం నీట మునుగుతుంది. వర్షాకాలంలో అయితే రోజుల తరబడి ఈ ప్రాంతం ముంపులోనే ఉంటుంది. ఆ సమయంలో స్థానిక ప్రజలకు పడవ ప్రయాణమే దిక్కు. ప్రధాన రహదారికి చేరుకోవాలంటే పల్లంగా ఉండే ప్రైవేటు స్థలంలో నిలిచిన ముంపునీటిలో పడవ ప్రయాణం చేయాల్సిందే. నిత్యావసర సరుకులు కావాలన్నా.. పిల్లలు పాఠశాలలకు వెళ్లాలన్నా పడవ ప్రయాణమే ఏకైక మార్గం. సాధారణ రోజుల్లో తమ ఇళ్ల నుంచి మార్కెట్‌యార్డు రోడ్డు మధ్యగా రాకపోకలు సాగిస్తుంటారు. వర్షం కురిస్తే నీరు నిలిచి ఆ ప్రాంతం చెరువులా మారుతుంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడతాయి. చేసేదేమీ లేక ఆ ప్రాంత ప్రజలు సమష్టిగా రూ.50 వేల ఇనుప పడవను కొనుగోలు చేసుకుని రాకపోకలకు వినియోగిస్తున్నారు.

మచిలీపట్నంలో కుండపోత

జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి కుండపోత వర్షం పడింది. శనివారం ఉదయం ఎనిమిది గంటలకు 15 సెంటీమీటర్లకు వర్షపాతం నమోదైంది. అర్ధరాత్రి నుంచి ఉరుములు, మెరుపులు, బలమైన గాలులతో కురిసిన కుండపోత వర్షంతో నగరంలోని ప్రధాన రహదారులతో పాటు లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. వర్షపునీటిలో ప్రయాణించేందుకు వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నగరం నడిబొడ్డున ఉన్న కోనేరుసెంటర్‌తో పాటు బస్టాండ్ సెంటర్, జిల్లా కోర్టు సెంటర్ తదితర ప్రాంతాలు నీటమునిగాయి. లోతట్టు ప్రాంతాలైన సుందరయ్యనగర్, టెంపుల్‌కాలనీ, డ్రైవర్స్‌కాలనీ, అరుణోదయ కాలనీ, జనశక్తినగర్ తదితర కాలనీల్లోని రోడ్లు నీటమునిగి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈడేపల్లి, సబ్‌జైలు, ఫత్తుల్లాబాద్ ప్రధాన డ్రెయిన్లతో పాటు కాలనీల్లోని డ్రెయిన్లు వర్షపునీటితో పొంగిపొర్లాయి. బస్టాండ్ ఆవరణలోకి వర్షపునీరు చేరటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.



చెరువును తలపిస్తున్న జిల్లా కోర్టు సెంటర్

జిల్లాలో 60.5 మి.మీ. సగటు వర్షపాతం

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షం కురిసింది. సగటు వర్షపాతం 60.5 మిల్లీమీటర్లుగా నమోదైంది. అత్యధికంగా మచిలీపట్నం మండలంలో 156.8, అత్యల్పంగా బాపులపాడు మండలంలో 5.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. మండలాల వారీగా.. కోడూరులో 152.6 మిల్లీమీటర్లు, పెడన 133.8, గూడూరు 110.2, చల్లపల్లి 96, మొవ్వ 89, కృత్తివెన్ను 62, గుడ్లవల్లేరు 60.2, బంటుమిల్లి 60, అవనిగడ్డ మండలంలో 57.6 మిల్లీమీటర్ల వర్షం పడింది. ఘంటసాల మండలంలో 54.8 మిల్లీమీటర్లు, నాగాయలంక 50.8, పమిడిముక్కల 47.6, పామర్రు 42.6, మోపిదేవి 40.2, పెదపారుపూడి 37.2, ఉంగుటూరు, కంకిపాడు 35.2, ఉయ్యూరు 34.2, నందివాడ 33.4, తోట్లవల్లూరు 33.2, గుడివాడ 30.4, పెనమలూరు 29.6, గన్నవరం మండలంలో 25.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రోడ్డు వసతి కల్పించాలి



మా కాలనీలో 30 కుటుంబాల వారు నివసిస్తున్నారు. వర్షం పడితే బయటకు వచ్చేందుకు పడవలోనే ప్రయాణం చేయాల్సి వస్తోంది. కాలనీ పక్కనే ప్రైవేటు స్థలం ఉండటంతో రోడ్డు వేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాలకులు ఈ ఇబ్బందులను తొలగించి మా కష్టాలు తీర్చేందుకు రహదారి సౌకర్యం కల్పించాలి. నీళ్లలో నడిచి వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల నీటిలో నడిచి వెళ్తున్న స్థానికులను పాము కరిచింది. అది విషపూరితం కాకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

– ఝాన్సీ, మాచవరం, మచిలీపట్నం

ఎస్పీగా రెడ్డి గంగాధర్‌రావు

పశ్చిమ గోదావరికి అద్నాన్ నయీం అస్మి బదిలీ



ఎస్పీగా నియమితులైన రెడ్డి గంగాధర్ రావు



పశ్చిమ గోదావరికి బదిలీ అయిన అద్నాన్ నయీం అస్మి

సాక్షి, మచిలీపట్నం: జిల్లా ఎస్పీగా రెడ్డి గంగాధర్ రావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఎస్పీగా పనిచేస్తున్న అద్నాన్ నయీం అస్మి పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. గంగాధర్‌రావు ప్రస్తుతం సీఐడీలో ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన స్వస్థలం ఏలూరు. పీజీ పూర్తిచేసిన గంగాధర్‌రావు 2004 నుంచి 2007 వరకు ఏలూరు జిల్లా బుట్టాయగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణిత అధ్యాపకుడిగా పనిచేశారు. ఓ వైపు విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పుతూనే మరోవైపు గ్రూప్స్‌కు సిద్ధమయ్యారు. 2007లో గ్రూప్–1లో ఉత్తీర్ణులై 2009లో డీఎస్పీ శిక్షణ పూర్తి చేసుకున్నారు. తొలి పోస్టింగ్ అమలాపురంలో, ఆ తరువాత కామారెడ్డి డీఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం అదనపు ఎస్పీగా ఉద్యోగోన్నతి పొంది, సీఐడీకి బదిలీ అయ్యారు. ఆ తరువాత ఐపీఎస్ ఖరారు కావడంతో ఏసీబీ జేడీ, అన్నమయ్య జిల్లా ఎస్పీగా విధులు నిర్వర్తించారు.

ఐదున్నర నెలలు పనిచేసిన అస్మి

విజయవాడ ఏసీబీ ఎస్పీగా చేసిన అద్నాన్ నయీం అస్మి ఎన్నికల నేపథ్యంలో కృష్ణా జిల్లాకు బదిలీపై వచ్చారు. జనవరి 31వ తేదీన ఇక్కడ విధుల్లో చేరారు. జమ్ము కశ్మీర్‌కు చెందిన ఆయన 2013 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ఆయన్ను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించగా తొలి పోస్టింగ్ ట్రైనీ ఎస్పీగా కృష్ణా జిల్లాకే వచ్చారు. ట్రైనీలోనే ఏడాది పాటు పని చేయడంతో జిల్లాపై పూర్తి అవగాహన కలిగి ఉన్నారు. ఇక్కడ ఎస్పీగా ఐదున్నర నెలలే చేసినా ప్రత్యేక గుర్తింపు దక్కించుకున్నారు. చిత్తశుద్ధితో సాధారణ ఎన్నికల నిర్వహణ, దొంగతనాలు, ఇతర నేరాల నియంత్రణకు కృషిచేశారు. అర్ధరాత్రి సాధారణ ఫోన్ కాల్ వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకోబోతున్నారనే సమాచారం ద్వారా తెలుసుకొని, కింది స్థాయి సిబ్బందిని అప్రమత్తంచేసి వారిని కాపాడారు. నిరుద్యోగ యువకుడు ఆత్మహత్య చేసుకోబోతుండగా సెల్ సిగ్నల్ ఆధారంగా అతడిని కాపాడడం వంటి సేవలతో మంచి పేరు తెచ్చుకున్నారు.

విద్యా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి



ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఉదయ్ పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నంలో యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ మహాసభల డోర్ స్టిక్కర్లను ఆవిష్కరించారు. అక్టోబర్ 18, 19 తేదీల్లో విజయవాడలో జరగనున్న యూఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఉదయ్ కోరారు. యువకులు అధికంగా పాల్గొని ఎన్‌డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, విద్యా వ్యతిరేక విధానాలను ఖండించాలన్నారు. హాస్టల్స్‌లో సమస్యలు పరిష్కరించి పెండింగ్‌లో ఉన్న కాస్మొటిక్ చార్జీలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పాత పద్ధతిలోనే అమలు చేయాలని కోరారు. యూనివర్సిటీల్లో వైస్ చాన్సలర్లు, అధ్యాపకుల ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

చేనేత సహకార సంఘాల బలోపేతానికి కృషి

చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత



పెడన సభలో మాట్లాడుతున్న మంత్రి సవిత, పక్కన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తదితరులు

పెడన/గూడూరు: చేనేత సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తామని, ప్రతి కార్మిక కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని బీసీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. పెడన నియోజకవర్గంలోని గూడూరు మండలం పోలవరం, కప్పలదొడ్డి గ్రామాలు, పెడన పట్టణంలో శనివారం మంత్రి పర్యటించారు. పోలవరంలోని శ్యాంప్రసాద్ చేనేత సహకార సంఘం, కప్పలదొడ్డిలోని దేవల మహర్షి సహకార సంఘం, పెడనలోని శ్రీ సదాశివలింగేశ్వర చేనేత సహకార సంఘాలను సందర్శించి వస్త్రాలు, మగ్గాలను పరిశీలించారు. ఆయా సంఘాల్లోని సభ్యులతో సమావేశమై వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి సవిత మాట్లాడుతూ.. చేనేత పరిశ్రమపై ఆధారపడి ఉన్న ప్రతి కుటుంబానికీ 365 రోజులూ ఉపాధి కల్పిస్తామన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి చేనేత సహకార సంఘాలకు రావాల్సిన బకాయిలను మంజూరు చేయిస్తానన్నారు. మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్, సబ్సిడీపై ముడి సరుకు అందిస్తామని హామీ ఇచ్చారు. చేనేత వస్త్రాలపై సరికొత్త డిజైన్లు రూపొందించేలా సహకార సంఘాలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 26 చేనేత సహకార సంఘాలు ఉండగా, పెడన నియోజకవర్గంలోనే 18 ఉన్నాయన్నారు. వాటికి రూ.104 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి పెడన పట్టణంలోని ప్రసాద్ కలంకారి వస్త్ర పరిశ్రమను సందర్శించారు. కలంకారీ వస్త్ర తయారీలోని ఏడు దశలను మంత్రికి పరిశ్రమ యజమాని బళ్ల ప్రసాద్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆప్కో ఎండీ పవన్ మూర్తి, చేనేత, జౌళి శాఖ కమిషనర్ శ్రీకాంత్ ప్రభాకర్, బందరు ఆర్డీఓ ఎం.వాణి, బీసీ సంక్షేమ శాఖ జేడీ తనూజ రాణి, గూడూరు తహసీల్దార్ ఎస్.ఎస్.శాంతి, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, వివిధ చేనేత సహకార సంఘాల అధ్యక్షులు పిచ్చుక గురూజీ కుమార్, పిచ్చుక నరేష్, కె.శ్రావణ్‌కుమార్, బళ్లా సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా, తెలంగాణ క్రీడాకారులు ముందంజ

విజయవాడస్పోర్ట్స్: స్పార్క్ చెస్ అకాడమీ రెండో అంతర్జాతీయ 1800 లోపు ఫిడే రేటింగ్ ఓపెన్ చెస్ టోర్నీ రెండో రోజు శనివారం హోరాహోరీగా సాగింది. విజయవాడ శివారు కానూరులోని ఆహ్వానం కల్యాణ మండపంలో జరుగుతున్న ఈ పోటీలకు భారత్‌తో పాటు కెన్యా, పాకిస్తాన్, అమెరికా క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రెండో రోజు ఆరు రౌండ్లు ముగిసే నాటికి 6/6 పాయింట్లతో ఆంధ్రా క్రీడాకారుడు టి.నిశ్చల్, తెలంగాణ క్రీడాకారుడు దివిత్‌రెడ్డి, తమిళనాడు క్రీడాకారుడు కేశవన్ ముందంజలో కొనసాగుతున్నారు. ఈ పోటీలు ఆదివారం ముగుస్తాయని టోర్నీ డైరెక్టర్ తాళ్ల నరేష్ తెలిపారు.

ప్రాథమిక విద్యను తెలుగులో కొనసాగించాలి

విజయవాడ కల్చరల్: ప్రాథమిక విద్యను తెలుగు మాధ్యమంలోనే కొనసాగించాలని విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌కు ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.వి.పూర్ణచందు శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో నాలుగు సెమిస్టర్ల విధానం అమలు చేయాలని, గ్రామీణ ఉద్యోగాల్లో తెలుగు మాధ్యమంలో చదువుకున్నవారికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. హైస్కూల్ విద్యార్థుల కోసం బాలల పత్రికను నిర్వహించాలని ఆ ప్రకటనలో విజ్ఞప్తిచేశారు.

రుణ మాఫీ హామీ.. పట్టించుకోరేమి?

- ఎమ్మెల్యేగా గెలిపిస్తే టిడ్కో రుణాలు మాఫీ చేస్తానన్న వెనిగండ్ల రాము
- గెలిచాక పట్టించుకోవడంలేదని టిడ్కో గృహ లబ్ధిదారుల ఆరోపణ
- రుణాలు మాఫీ చేయించి ఆదుకోవాలని వేడుకోలు



టిడ్కో రుణాలు మాఫీ చేయాలని ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

గుడివాడరూరల్: గుడివాడ నుంచి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా సంబంధం లేకుండా టిడ్కో లబ్ధిదారులకు రుణమాఫీ చేస్తానని టీడీపీ అభ్యర్థిగా వెనిగండ్ల రాము ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. తీరా గెలిచిన తర్వాత ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని ఎమ్మెల్యేను ఆశ్రయిస్తే ముఖం చాటేస్తున్నారని టిడ్కో గృహాల లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హామీ నెరవేర్చాలని ఎమ్మెల్యే కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా సరైన సమాధానం ఇవ్వడంలేదని వాపోతున్నారు. రుణాలు చెల్లించే పరిస్థితి తమకు లేదని, రుణమాఫీ చేసి ఆదుకోవాలని కన్నీరు మున్నీరవుతున్నారు.

హామీని నమ్మిన లబ్ధిదారులు

ఈ నెల 11వ తేదీ గురువారం టిడ్కో సముదాయం వద్ద టిడ్కో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. పేదల సొంత ఇంటి కల నెరవేర్చాలంటూ కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) టీడీపీలో ఉన్న సమయంలో గుడివాడ నుంచి హైదరాబాద్‌కు పాదయాత్ర చేశారు. ప్రతిపక్ష టీడీపీ ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజ శేఖరరెడ్డి గుడివాడ మండలం మల్లాయపాలెంలో 77 ఎకరాలను మంజూరు చేశారు. టిడ్కో ఇళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను టిడ్కో ఇళ్లుగా మార్చి నిర్మాణాలు చేపట్టినా అవి అసంపూర్తిగానే మిగిలాయి. 2019లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తండ్రి సంకల్పాన్ని నెరవేరుస్తూ టిడ్కో ఇళ్లను పూర్తి చేసి సకల సౌకర్యాలు కల్పించి నిరుపేదలకు పంపిణీ చేశారు. ఈ క్రమంలో 2024 ఎన్నికల ప్రచారంలో టీడీపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన వెనిగండ్ల రాము తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా టిడ్కో లబ్ధిదారులు చెల్లించాల్సిన రుణాలను తన సొంత నిధులతో చెల్లిస్తానని హామీ ఇచ్చారు. రాము ఇచ్చిన హామీని నమ్మిన లబ్ధిదారులు ఆయనకు ఓటు వేసి గెలిపించారు.

హామీ నెరవేర్చకపోతే ఆందోళన ఉధృతం

టిడ్కో ఇళ్ల రుణాలను చెల్లించాలంటూ బ్యాంక్ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఇటీవల బ్యాంకర్ల వేధింపులు తట్టుకోలేక ఇద్దరు లబ్ధిదారులు ఆత్మహత్యకు ప్రయత్నించగా చుట్టు పక్కల వారు రక్షించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని లబ్ధిదారులు హెచ్చరిస్తున్నారు.

మాట నిలబెట్టుకోవాలి



టిడ్కో ఇళ్ల కోసం బ్యాంక్ రుణాలను కొన్ని నెలలుగా సక్రమంగా చెల్లిస్తున్నాం. ఎన్నికల ప్రచారంలో తనను గెలిపిస్తే రుణాలను మాఫీ చేస్తామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హామీ ఇచ్చారు. గెలిచిన తర్వాత రుణ మాఫీ గురించి అడిగితే తనను కలవద్దని చెప్పారు. రుణ మాఫీ చేసి ఆదుకోవాలి.

– విజయ, టిడ్కో లబ్ధిదారురాలు

బ్యాంకర్ల నుంచి బెదిరింపులు



ఎన్నికల్లో గెలిస్తే రుణమాఫీ చేస్తామన్నారు. తీరా గెలిచిన తర్వాత ముఖం చాటేస్తున్నారు. ఇళ్లు జప్తు చేస్తామని బ్యాంకర్లు బెదిరిస్తున్నారు. బ్యాంకర్ల ఇబ్బందులు తట్టుకోలేక లబ్ధిదారులు ఆత్మహత్యాయత్నాలు చేసిన ఘటనలున్నాయి. ఎమ్మెల్యే మాకు న్యాయం చేయాలి.

– ఎం.దుర్గ, టిడ్కో అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షురాలు

ధర్నా చేస్తాం



టిడ్కో లబ్ధిదారుల రుణాలు మాఫీ చేస్తామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హామీ ఇచ్చారు. ఇప్పుడు మాఫీ మాట ఎత్తడం లేదు. బ్యాంకర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మాట నిలబెట్టుకోకపోతే ఎమ్మెల్యే కార్యాలయం, ఇంటి ముందు ధర్నా చేస్తాం.

– బసవ అరుణ, టిడ్కో అభివృద్ధి కమిటీ కార్యదర్శి

క్లుప్తంగా

మంగలేరు డ్రైన్‌లో మత్స్యకారుడు గల్లంతు



కోనేరుసెంటర్: మంగలేరు డ్రైన్‌లో పడి ఓ మత్స్యకారుడు గల్లంతయ్యాడు. జరిగిన ప్రమాదం తెలుసుకున్న స్థానికులు గల్లంతైన మత్స్యకారుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నం శారదానగర్‌కు చెందిన మైలా శ్రీను కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంటాడు. అతనికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పొట్టకూటి కోసం కూలి పనులు చేసుకునే శ్రీను మధ్యమధ్యలో చేపలను పట్టుకుని అమ్ముకుంటుంటాడు. శనివారం శారదానగర్‌కు ఆనుకుని ఉన్న మంగలేరు డ్రైన్‌లో చేపలు పట్టుకునేందుకు వల కట్టాడు. సాయంత్రం సమయంలో వల తీసేందుకు వెళ్లాడు. వల చేతికి రాకపోవటంతో డ్రైన్‌లోకి దిగి ఒక్కసారిగా డ్రైన్‌లో మునిగిపోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు కొందరు శ్రీనును నీటిలో నుంచి బయటికి లాగేందుకు ప్రయత్నించారు. అయితే డ్రైన్ ఉండాల్సిన దానికంటే లోతుగా ఉండటంతో శ్రీను స్థానికులకు చిక్కలేదు. శ్రీను కోసం కుటుంబసభ్యులతో పాటు శారదానగర్‌కు చెందిన పలువురు గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనాస్థలం వద్దకు చేరుకుని శ్రీను కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయించారు. శ్రీను ఆచూకీ తెలియకపోవటంతో కుటుంబసభ్యులు ఆందోళనలో ఉన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో విపత్తుల నిర్వహణ

ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా

తాడేపల్లిరూరల్: విపత్తులను ఎదుర్కొనేందుకు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని రెవెన్యూ శాఖ (ల్యాండ్స్, విపత్తుల నిర్వహణ, రిజిస్ట్రేషన్స్) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా సూచించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు.

కుష్టు వ్యాధి నివారణ అందరి లక్ష్యం కావాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గీతాబాయి

కంకిపాడు: కుష్టు వ్యాధి నిర్మూలన అందరి లక్ష్యం కావాలని, బాధ్యతతో విధులు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి ఆదేశించారు. జాతీయ కుష్టు నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉప్పులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధి లక్షణాలు కల వారి గుర్తింపుపై శనివారం ఆరోగ్య సిబ్బంది ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి మాట్లాడుతూ కుష్టు వ్యాధిని పూర్తి స్థాయిలో నిర్మూలించాలనే లక్ష్యంతో ఈనెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకూ ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటి సర్వే చేపట్టామన్నారు. చర్మంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, నొప్పితో కూడిన నరములు, నరముల తిమ్మిర్లు, నొప్పిలేని పుండ్లు మొదలైన లక్షణాలు కలవారిని గుర్తించి ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. వ్యాధి నిర్ధారణ, సకాలంలో వైద్యం అందించటం ద్వారా వ్యాధిని నియంత్రించవచ్చన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఆహార అలవాట్లపై శ్రద్ధ తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. వైద్యాధికారులు డాక్టర్ సంతోష చంద్రిక, డాక్టర్ సుధా ప్రసూజ, డీపీఎంఓ శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెనమలూరులో...

పెనమలూరు: కుష్టు వ్యాధి నివారణకు చర్యలు చేపట్టి ప్రజల్లో వ్యాధి పట్ల అవగాహన పెంచాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.గీతాబాయ్ అన్నారు. పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపేన్(ఎల్‌సీడీసీ) శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 31వ తేదీ వరకు అన్ని మంచి నీటి ట్యాంకులు క్లోరినేషన్ చేయించాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి బిజిలీ శ్రీనివాసరావు, వైద్యులు సాయిలత, సుస్మిత, మంజుల, సీహెచ్‌వోలు కుమార్, లక్ష్మయ్య, బి.శివారెడ్డి, ఆశ, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఉప్పులూరు పీహెచ్‌సీలో సమీక్ష చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి



పోరాటనగర్‌లో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

లబ్బీపేట(విజయవాడతూర్పు): సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగించడంతో పాటు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు. ఆమె శనివారం పలు ప్రాంతాల్లో పర్యటించి వైద్య సేవలు అందుతున్న తీరును పరిశీలించారు. పోరాటనగర్, కీర్తిరాయుని గూడెంలో జ్వరం కేసులు నమోదు కావడంతో ఆ ప్రాంతంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా 9 వైద్య బృందాలు శనివారం 367 ఇళ్లను సర్వే చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు. పంచాయతీ సిబ్బంది బ్లీచింగ్ చల్లడంతో పాటు, యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు.

ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీని శనివారం డీఎంహెచ్ఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో కాన్పు అయిన తల్లి, బిడ్డల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనతరం ఏఎన్ఎంలతో సమావేశం ఏర్పాటు చేసి, వారి పరిధిలో వాంతులు, విరేచనాలు, జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎన్టీఆర్ జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, వైద్యాధికారులు డాక్టర్ పర్విన్, డాక్టర్ సునీల్, డాక్టర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదుతో ఏడుగురిపై కేసు

పెనమలూరు: వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు శనివారం ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురులో ఈద్గా, కబరస్తాన్, మసీదు కొద్ది కాలం క్రితం వక్ఫ్ బోర్డు పరిధిలోకి వచ్చాయి. ఈద్గా, మసీదులో ప్రార్థనలు చేయటానికి గతంలో మౌజమ్‌లుగా ఉన్న షేక్ అక్రమ్, రాజా అహ్మద్ విధులు సక్రమంగా నిర్వహించటం లేదని వారిని తొలగించారు. వారి స్థానంలో వక్ఫ్ బోర్డు ఎండీ హైదర్‌అలి, ఎండీ జాఫర్ అహ్మద్‌లను నియమించింది. కొత్తగా వచ్చిన మౌజమ్‌ల విధుల నిర్వహణకు షేక్ అక్రమ్, రాజా అహ్మద్ ఆటంకం కలిగిస్తున్నారు. పైగా ఈద్గాలో ఉన్న సీసీ కెమేరాలను చట్టవిరుద్ధంగా తొలగించారు. షేక్ అష్రఫ్, షేక్ సలీమ్, షేక్ కరీముల్లా, షేక్ సాల్‌మన్, షేక్ నాగూర్ సహకారంతో ఈద్గాలో కార్యక్రమాలతో పాటు వక్ఫ్ పరిపాలనకు అంతరాయం కలిగించసాగారు. దీంతో వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ ఎండీ నూహూఆలీషా ఇచ్చిన ఫిర్యాదుతో పై ఏడుగురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.6.50 లక్షల విలువైన బంగారం, నగదు చోరీ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఒంటరిగా ఉన్న వృద్ధురాలి ఇంట్లో చొరబడి బంగారు ఆభరణాలు, నగదు చోరీ చేసిన ఘటనపై శనివారం ఎస్ఎస్‌పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంభంపాటి రాజ్యలక్ష్మి అనే వృద్ధురాలు తన మనవడుతో కలసి సత్యనారాయణపురం, సుమనం వారి వీధిలో నివాసముంటున్నారు. త్వరలో తన మనవడి పెళ్లి ఉండటంతో ఇంటికి రంగులు వేసేందుకు నాలుగు రోజుల క్రితం అదే ప్రాంతంలోని షిర్డి అపార్ట్‌మెంట్‌లోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఒక ఇల్లు అద్దెకు తీసుకున్నారు. శుక్రవారం తన మనవడు పాత ఇంటి పనులు చూసుకుంటూ అక్కడే ఉండటంతో రాత్రి వృద్ధురాలు ఒంటరిగా అద్దె ఇంట్లోనే నిద్రించింది. పెళ్లి కోసం కొనుగోలు చేసిన రూ. 6 లక్షల విలువచేసే 125 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదును ఒక బ్యాగులో ఉంచి వృద్ధురాలు తనతో పాటు ఉంచుకుంది. రాత్రి 12 నుంచి ఉదయం 6 గంటల మధ్యలో గుర్తు తెలియని దొంగలు ఇంటి వంటగదిపైన ఉన్న ఒక రంధ్రంలో నుంచి ఇంట్లోకి చొరబడి బంగారు ఆభరణాలు, నగదు ఉన్న బ్యాగును చోరీ చేసి పరారయ్యారు. ఉదయం నిద్రలేచిన వృద్ధురాలు చోరీ జరిగినట్లు గుర్తించి ఎస్ఎస్‌పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు క్లూస్ టీంద్వారా ఆధారాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు.

మేధో వికాసం మాతృమూర్తితోనే సాధ్యం

విజయవాడ కల్చరల్: వ్యక్తుల మేధో వికాసం మాతృమూర్తితోనే సాధ్యమని చైతన్య తపోవనం పీఠాధిపతి మాతా శివ చైతన్య అన్నారు. విజయవాడ సత్యనారాయణపురంలోని సంస్కృత భారతి సంస్థ రెండు రోజులపాటు జాతీయ స్థాయి అఖిల భారత బాల కేంద్ర శిక్షకుల ప్రశిక్షా కార్యక్రమం నిర్వహించింది. శనివారం నాటి శిక్షణ కార్యక్రమాలను మాతా శివ చైతన్య ప్రారంభించారు. వ్యక్తులను సమాజాన్ని వేరువేరుగా చూడలేమని సత్ సంప్రదాయం తల్లి వలనే సాధ్యమన్నారు. రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రతి నగరంలోనూ బాల సంస్కృత కేంద్రాలను ప్రారంభించాలని కోరారు. మహామహోపాధ్యాయ దోర్బల ప్రభాకర శర్మ నగరంలో విజయవాడ సంస్కృత భారతి కేంద్రం ఎందరో యువతీ యువకులకు శిక్షణ ఇస్తోందన్నారు. దుర్గ గుడి ఈఓ రామరావు, అఖిలభారత ప్రశిక్షణ ప్రముఖులు ఉపద్రష్ట రమణ మూర్తి సంస్కృత అధ్యయనం అంశంగా ప్రసంగించారు. దేశంలోని 30 రాష్ట్రాలనుంచి 86 బాల కేంద్రం ప్రముఖులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉప కులపతి జీఎస్ఆర్ కృష్ణ మూర్తి, వేదికపై మాతా శివచైతన్య, దోర్బల ప్రభాకర శర్మ

భారీ వర్షానికి కుప్పకూలిన ఇంటి గోడ

ప్రాణాపాయం తప్పడంతో ఊపిరి పీల్చుకున్న కుటుంబ సభ్యులు

పాపవినాశనం(ఘంటసాల): భారీ వర్షానికి ఇంటి గోడ కుప్పకూలింది. అయితే ఇంట్లో నిద్రిస్తున్న ఐదుగురు కుటుంబసభ్యులు ప్రాణాపాయం నుంచి బయట పడ్డారు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి ఘంటసాల మండలం పాపవినాశనం గ్రా మంలో జరిగింది. గ్రామస్తులు అందించిన వివరా ల మేరకు పాపవినాశనం ఎస్సీ కాలనీకి చెందిన మొవ్వ జన్ను భార్య, ముగ్గురు పిల్లలు, తల్లితో కలసి రేకుల షెడ్డులో నివసిస్తున్నారు. శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులు పడుకున్న తర్వాత ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం ప్రారంభమైంది. అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో వారు నివసిస్తున్న ఇంటి బయట వైపు ఉన్న గోడ కుప్పకూలిపోవడంతో భారీ శబ్దం వచ్చింది. భయంతో ఒక్కసారి ఉలిక్కిపడి లేచిన కుటుంబ సభ్యులు ఇంటి గోడ కూలిపోవడం చూసి తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అదే ఇంటి గోడ లోపలి వైపు కూలినట్లయితో ఆస్తి నష్టంతో పాటు కుటుంబ సభ్యులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడేదని గ్రామస్తులు తెలిపారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే జన్ను ఇటీవల కుమారునికి ఆపరేషన్ చేయించి ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నారు. ఇప్పుడు ఇంటి గోడ కూలి ఆస్తి నష్టం జరిగింది. అధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆదుకోవాలని, దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సాయం చేయాలని జన్ను కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.



భారీ వర్షాలకు కూలిన ఇంటిగోడ

దుర్గమ్మ సేవలో సీపీ దంపతులు



రాజశేఖర్‌బాబు దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామరావు



పీహెచ్‌డీ రామకృష్ణకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామరావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖర్‌బాబు దంపతులు శనివారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన సీపీ రాజశేఖర్‌బాబు దంపతులకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఈవో కె.ఎస్. రామరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

దుర్గమ్మ సేవలో పీహెచ్‌డీ రామకృష్ణ

ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను విజయవాడ సీపీగా బాధ్యతలు నిర్వహించిన పీహెచ్‌డీ రామకృష్ణ శనివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన రామకృష్ణకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

బ్రైట్ కెరీర్ గ్రూప్ సీఈవోను తక్షణమే అరెస్ట్ చేయాలి

- బాధితులకు న్యాయం చేయాలి
- ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విదేశాల్లో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేసిన బ్రైట్ కెరీర్ గ్రూప్ సీఈఓ విష్ణు చౌదరిని తక్షణమే అరెస్ట్ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు డిమాండ్ చేశారు. విజయవాడ హనుమాన్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయవాడ గాంధీనగర్ కేంద్రంగా నిర్వహిస్తున్న బ్రైట్ కెరీర్ సంస్థ నెదర్లాండ్స్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. సంస్థ బారినపడి ఈ ప్రాంతానికి చెందిన 120 మంది, దేశవ్యాప్తంగా 500 మంది నిరుద్యోగులు మోసపోయారన్నారు. నెదర్లాండ్స్‌లోని ఆర్మో ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని, నెలకు రూ.2.89 లక్షలు జీతం వస్తుందని నమ్మబలికి, వారి వద్ద నుంచి రూ.75 వేలు వసూలు చేశారన్నారు. అభ్యర్థులు హెల్త్ చెకప్, ఫిజికల్ టెస్టులు పూర్తి చేసుకుని కాల్ లెటర్స్ కోసం ఎదురుచూస్తున్న తరుణంలో నిర్వాహకులు గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయాన్ని మూసివేశారన్నారు. నిర్వాహకులు ఫోన్‌లు స్విచాఫ్ చేసి నిరుద్యోగులను నట్టేట ముంచేశారన్నారు. సంస్థ సీఈఓ విష్ణు చౌదరి, మేనేజర్లు విజయేంద్ర సింగ్, ఆకాష్ సింగ్‌లను తక్షణమే అరెస్ట్ చేయాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో జిల్లా కలెక్టర్, హోంమంత్రి, డీజీపీలను కలిసి వినతిపత్రాలు అందజేస్తామన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు, బ్రైట్ కెరియర్ గ్రూప్ సంస్థ బాధితులు ఎస్.ఆదిత్య, ఎస్.జైరామ్, ఏఐవైఎఫ్ నాయకులు సింగంశెట్టి మోహన్ ప్రసాద్, గాడి అజయ్, హరీష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు